AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
3-4-2026 (Friday) MAIN EDITION

## అమెరికా ఆర్మీ చీఫ్ జనరల్‌గా రాండీ జార్జ్ తొలగింపు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా – ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా సైన్యంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆర్మీ చీఫ్ జనరల్ రాండీ ఏ.జార్జ్‌ను అమెరికా అకస్మాత్తుగా పదవి నుంచి తప్పించింది. ఈ మేరకు అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ ఆయనను తక్షణమే పదవి నుంచి వైదొలగాలని ఆదేశించినట్లు పెంటగాన్ వెల్లడించింది. అయితే ఈ తొలగింపుకు గల స్పష్టమైన కారణాలను అధికారులు వెల్లడించలేదు.

## తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని వెల్లడించారు. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, జనగామ, మెదక్, జగిత్యాల జిల్లాల్లో వాన అవకాశముందన్నారు.

## వాళ్ల సంక్షేమం పట్టదా..?: హరీశ్‌రావు



అక్షరటుడే, నాగర్ కర్నూల్: నాగర్ కర్నూల్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని తిమ్మారెడ్డి పల్లిలో మాజీ మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు.

## బలపడిన రూపాయి విలువ



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: రూపాయి విలువ ఇటీవల వేగంగా పడిపోయిన విషయం తెలిసిందే. కాగా.. నాలుగు రోజుల నుంచి బలపడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా బలపడింది. గత నాలుగైదు రోజుల క్రితం డాలర్‌తో పోలిస్తే రూ. 95 ఉన్న విలువ నేడు రూ. 92.62 పైసలకు చేరింది. నాలుగు రోజుల్లోనే రూ.3కు పైగా బలపడింది.

## ఐపీఎస్ కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. కొండాపూర్ క్వాక్ ఎరీనా పబ్‌లో 64 మందికి టెస్టులు చేయగా 8 మందికి పాజిటివ్‌గా తేలింది. వీరిలో ఏపీకి చెందిన ఓ మహిళా ఐపీఎస్ అధికారి కుమారుడు ఉన్నట్లు సమాచారం. కాగా.. ఇదే టెస్టుల్లో తనకు నెగెటివ్ వచ్చిందని యాక్టర్ హేమ వీడియో రిలీజ్ చేసిన విషయం తెలిసిందే.

## 'నా నోరు నొక్కితే.. మీరు గెలిచినట్లు కాదు': రాఘవ్ చద్దా



**అక్షరటుడే, ఢిల్లీ:** రాజ్యసభ ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పార్టీ తొలగించిన విషయం తెలిసిందే. కాగా.. దీనిపై ఆ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా శుక్రవారం స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్'లో వీడియో పోస్ట్ చేశారు. "పార్లమెంటులో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడల్లా నేను ప్రజా సమస్యలను లేవనెత్తుతాను. నేను ఏదైనా నేరం చేశానా? నేను ఏదైనా తప్పు చేశానా? నేను ఏదైనా పొరపాటు చేశానా?" ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరని వ్యాఖ్యానించారు. 'పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వకూడదని మా పార్టీ రాజ్యసభ సెక్రెటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది' అని పేర్కొన్నారు.

## గల్ఫ్‌లోని 8 వంతెనల 'హిట్ లిస్ట్' విడుదల చేసిన ఇరాన్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మిడిల్ఈస్ట్‌లో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఇరాన్‌పై భీకర దారుడు చేస్తామని ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్‌లోని అతిపెద్ద బీ1 వంతెను అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇరాన్ స్పందించింది. దాడులకు ప్రతీకారంగా మధ్యప్రాచ్యంలోని ఎనిమిది ప్రధాన వంతెనలను లక్ష్యంగా చేసుకో గల జాబితాను విడుదల చేసింది.



**వస్త్ర పరిశ్రమ రంగంలో 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే గొప్ప టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీ, ఫార్మా రంగాల్లోనే కాకుండా, ప్రపంచ వస్త్ర రంగంలోనూ అగ్రగామిగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణ రైజింగ్‌లో వ్యాపరవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు. హైదరాబాద్ నగరంలోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్‌స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు.** - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ..

■ అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన చరిత్ర భారత్‌ది ■ ఆసియా టెక్‌స్‌టైల్స్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర భారతదేశానికి ఉందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్స్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయని పేర్కొన్నారు. నిజాం కాలంలో ప్రపంచ నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్ నగరానికి వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేశారని వివరించారు. తెలంగాణ ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలదని.. టెక్స్‌టైల్స్ మా డీఎన్ఏలో ఉందన్నారు.

### తెలంగాణ ముందంజకు చారిత్రక కారణాలు

వస్త్ర పరిశ్రమలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలో పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నామని.. పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరుందన్నారు. టెక్స్‌టైల్ తెలంగాణకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదని.. ప్రజల జీవనాధారమని వివరించారు. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వరకు అనేకం ఇక్కడ ఉన్నాయని చెప్పారు.

### తెలంగాణలో నైపుణ్యం

తెలంగాణలో నైపుణ్యం, మంచి సంకల్పం ఉన్నాయని పేర్కొన్నారు. డీప్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ వంటి అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్‌స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో అనేక అప్పరెల్ పార్కులున్నాయని వివరించారు.

### మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా..

తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ద్వారా 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. అలాగే 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నే మా లక్ష్యమని చెప్పారు. వస్త్ర పరిశ్రమకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు.

### గ్లోబల్ సినిమా హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్ గ్లోబల్ సినిమా హబ్‌గా ఎదుగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించామన్నారు. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుండగా.. ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరిందన్నారు. సినిమా సంబంధిత ఫ్యాషన్ రంగాన్ని కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.



## నౌకాదళ అమ్ముల పొదిలోకి ఐఎన్ఎస్ 'తారాగిరి'..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీనిని కమిషన్ చేశారు. కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పేరును ఇప్పుడు ఎవరైనా వాడుకోవచ్చు: కవిత



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చని తెలిపారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని వెల్లడించారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే పార్టీ నడుస్తుందని పేర్కొన్నారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త ఎవరూ లేరని చెప్పారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

## విజయ్ సేతుపతి - సాయి పల్లవి జంటగా క్రేజీ ప్రాజెక్ట్..

**విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, నేచురల్ బ్యూటీ సాయి పల్లవి జంటగా లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం క్రేజీ ప్రాజెక్టును తెరకెక్కించబోతున్నారు. అయితే ఈ మూవీ షూటింగ్ డేట్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం జూన్‌లో రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ కలిసి ఈ మూవీని నిర్మిస్తున్నారు. సాయి పల్లవి చేతిలో ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్‌తో కలిసి ఆమె నటించిన 'ఏక్ దిన్' మే 1న థియేటర్స్‌లోకి రానుంది. అంతేకాకుండా నితీష్ తివారీ దర్శకత్వంలో వస్తున్న హిస్టారిక్ మూవీ 'రామాయణం'లో సీతగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ మణిరత్నం మూవీ కోసం డేట్స్ అడ్జస్ట్ చేసింది సాయిపల్లవి.**

- అక్షరటుడే, సినిమాడెస్క్



## ప్రజా రాజధానికి దక్కిన గౌరవం..: సీఎం చంద్రబాబు



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ప్రజా విజయమని.. ఇది ప్రజా రాజధానికి దక్కిన గౌరవమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ బిల్లుకు వైఎస్సార్‌సీపీ తప్పా అన్ని పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి పూర్తి సహకారం అందించిన ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. అలాగే బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు చెప్పారు.

## తమిళనాడు బీజేపీ అభ్యర్థుల తొలిజాబితా విడుదల




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో పార్టీలు తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తున్నాయి. ఇందులో భాగంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శుక్రవారం తన తొలి జాబితా విడుదల చేసింది. తన 27 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను రిలీజ్ చేసింది. ఈ జాబితాలో పలువురు ప్రముఖులు ఉన్నారు. ఇందులో మైలాపూర్ నియోజకవర్గం నుంచి తమిళిసై సౌందరరాజన్ బరిలోకి దిగనున్నారు. ఇక కోయంబత్తూరు (ఉత్తర) నియోజకవర్గం నుంచి వనతి శ్రీనివాసన్ పోటీ చేయనున్నారు. కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ అవినాశి (ఎస్సీ) నియోజకవర్గం నుంచి పోటీలో నిలబడనున్నారు.

## ఇరాన్‌లోని అతిపెద్ద వంతెనపై దాడి..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. అనేక కీలక లక్ష్యాలపై దాడులు చేస్తున్నాయి. తాజాగా ఇరాన్‌కు చెందిన అతిపెద్ద వంతెన పేల్చివేశాయి. పశ్చిమాసియాలోనే ఇది అతిపెద్ద వంతెనగా తెలుస్తోంది. కాగా.. ఈ దాడిని దాడిని ఇరాన్ ధ్రువీకరించింది. ఇరాన్‌పై అతి భీకర దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించిన గంటల్లోనే దాడులు జరగడం గమనార్హం. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఇరాన్ ప్రభుత్వానికి మరోసారి హెచ్చరిక జారీ చేశారు. "ఇరాన్‌లో మిగిలిన లక్ష్యాలను నాశనం చేస్తాం. అమెరికా బలగాలు ఇంకా అసలు దాడులు ప్రారంభించలేదు" అని పేర్కొన్నారు. ఆ దేశంలోని మరిన్ని వంతెనలు, ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.